సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

## 'మహాధర్నా'ను జయప్రదం చేయాలి

**ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు**

నెల్లికుదురు, నవంబర్ 24: మహబూబాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో నేడు నిర్వహించనున్న గిరిజన రైతుల మహాధర్నా కార్యక్రమంలో గిరిజన రైతులు, బీఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మండలంలోని నైనాల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ యాసం రమేశ్ స్వగృహంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. లగచర్ల గిరిజన రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ వారి పక్షాన నిలుస్తుందన్నారు. ప్రైవేట్ ఫార్మా కంపెనీలు నిర్మించడానికి పేదోడి భూములను బెదిరించి లాక్కుంటారా.. ఇది ప్రజాసామ్యమా..? అని ప్రశ్నించారు. కంపెనీ ఏర్పాటుకు భూములు ఇవ్వమని చెప్పిన రైతులపై లాఠీలతో దాడి చేయిస్తారా? ఇదేనా కాంగ్రెస్ పాలకులకు రైతులపై ఉన్న చిత్తశుద్ధి? అని మండిపడ్డారు. గిరిజన రైతుల భూములను లాక్కుంటే ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ ఊరోకోదని హెచ్చరించారు. దేశానికి అన్నంపెట్టే రైతన్నకు అన్యాయం జరిగితే కేసీఆర్ సహించరని తెలిపారు. ధర్నా కార్యక్రమానికి మాజీ మంత్రులు, ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా శ్రేణులు జేరుపోతులు వెంకన్న, బానోత్ రవికుమార్, నాయకులు యాసం రమేశ్, భూక్యా బాలా జీనాయక్, ఎర్రబెల్లి నవీన్‌రావు, పెరుమాండ్ల ఉపేందర్, కొమురయ్య, చిర్ర శ్రీనివాస్, దండెపల్లి వెంకటసాయిలు, బత్తిని నవీన్, అజయ్, ఆకుల మల్లేశ్ పాల్గొన్నారు.

## లగచర్ల ఘటనపై మాటమార్చిన రేవంత్ సర్కార్

- అబద్ధాలు, మోసపు హామీలతో అధికారంలోకి వచ్చావ్..
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు/పెద్దవంగర, నవంబర్ 24: లగచర్ల రైతుల భూములను ఆక్రమించుకునే ప్రయత్నం చేసిన రేవంత్ సర్కార్‌కు అక్కడి రైతులు గట్టిగానే సమాధానం చెప్పారని, వారికి అండగా కేటీఆర్ చేపట్టిన మహాధర్నాకు భయపడిన రేవంత్‌రెడ్డి.. 'అక్కడ ఏర్పడేది.. ఫార్మాసిటీ కాదు.. ఇండస్ట్రియల్ కారిడార్..' అంటూ మాట మార్చారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం తొర్రూరు, పెద్దవంగర బీఆర్ఎస్, గిరిజన నాయకులు, రైతులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో తలపెట్టిన ధర్నాకు గిరిజన రైతులు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి ప్రజలను నేటికీ అసత్యాలతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. 'సొంత నియోజకవర్గ ప్రజలకు ఇంత నష్టం జరుగుతుంటే ఒక్కసారైనా కలిశారా..? వారితో మాట్లాడారా..? ఆ భూములపై కన్నేసి మాట మార్చారే కానీ, రైతుల భూములను తీసుకోమని ఒక్క మాట కూడా మాట్లాడడం లేదని' మండిపడ్డారు. 'రైతులు, నాయకులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేసే వరకు మా పోరాటం ఆగదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులు, గిరిజన లంబాడాలపై దాడులు ఎక్కువయ్యాయి. కనీసం కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడుతుంటే రేవంత్‌రెడ్డి తట్టుకోలేకపోతున్నారని' విమర్శించారు. 'కేటీఆర్ మహాధర్నా ప్రకటిస్తే భయపడి అనుమతులు రాకుండా చేసి మమ్మల్ని ఏదో భయపెట్టాలని అనుకుంటున్నావు.. మాకు ఈ పోరాటాలు కొత్తేమీ కావు. ఖబడ్దార్.. ఇకనైనా తీరు మార్చుకో.. ప్రజలకు ఏదైనా బాగుపడే పని చేయాలి' అని పేర్కొన్నారు. 'ప్రజాపాలన అంటివి.. ప్రజలను గాలికి వదిలేసి నువ్వు మాత్రం గాలిమోటర్ ఎక్కి ఢిల్లీలో చక్కర్లు కొడుతున్నావని' విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సీతారాములు, ఐలయ్య, ప్ర మోద్, సంజయ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ అంజయ్య, దేవస్థాన చైర్మన్ మాజీ రామచంద్రయ్య శర్మ, నాయకులు శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, పటేల్‌నాయక్, జైసింగ్, వెంకన్న, హరీశ్‌యాదవ్ పాల్గొన్నారు.

పెద్దవంగరలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

**ఆపదలో ఆదుకొని మానవత్వం చాటుకొని..**

పెద్దవంగర: కొరిపెల్లి గ్రామ పరిధిలోని వలిగొండ–తొర్రూరు మధ్యలో పాలకుర్తి మండలం చెన్నూరు శివారు లావుడ్యా తండాకు చెందిన లావుడ్యా ఇస్తార్ చిన్న కుమార్తెకు ఫిడ్స్ వచ్చి రోడ్డుపై పడిపోయింది. జిల్లా కేంద్రంలో ధర్నా కార్యక్రమ పనులను పరిశీలించేందుకు వెళ్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు గమనించి తన వాహనాన్ని ఆపి వారికి సపర్యలు చేసి అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఆదుకొని మానవత్వం చాటుకున్నారు. దీంతో స్థానికులు, బాటసారులు ఎర్రబెల్లి దయాకర్‌రావును పొగడ్తలతో ముంచెత్తించారు.

## 'మహాధర్నా' స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రులు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 24: జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో సెంటర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు నిర్వహించనున్న గిరిజన రైతుల మహాధర్నా కార్యక్రమ స్థలాన్ని ఆదివారం మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ పరిశీలించారు. ఈ ధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రవీందర్ రావు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యా నాయక్, శంకర్‌నాయక్, పార్టీ నాయకులు ఉన్నారు.

**రైతు, గిరిజనులు అధిక సంఖ్యలో తరలిరావాలి**

కేసముద్రం: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపట్టనున్న రైతు మహాధర్నాకు రైతులు, పార్టీ నాయకులు, గిరిజనులు అధిక సంఖ్యలో తరలిరావాలని పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ వాంకుడోత్ తరుణ్‌నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లగచర్ల ఘటనలో లంబాడాలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, జైలు నుంచి తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని పేర్కొన్నారు.

ఈరియానాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

## మాజీ ఎంపీపీకి ఎమ్మెల్సీ పోచంపల్లి పరామర్శ

కురవి, నవంబర్ 24: మాజీ ఎంపీపీ గుగులోత్ పద్మావతి మామ, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు గుగులోత్ రవినాయక్ తండ్రి ఈరియానాయక్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షుడు వెంపటి సతీశ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థల మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు పరామర్శించారు. ఈరియానాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి వెంట ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ కుడితి మహేందర్‌రెడ్డి, బజ్జూరి పిచ్చిరెడ్డి, యళ్ల మురళీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తోట లాలయ్య, భోజునాయక్, గుండోజు శ్రీనివాస్, రవీందర్, వెంకన్న, బానోత్ రాము ఉన్నారు. అదేవిధంగా మరిపెడ మండలంలోని బీచురాజుపల్లికి చెందిన జరుపుల వెంకన్న కుమారుడి వివాహ రిసెప్షన్‌కు గుడిపుడి నవీన్‌రావు హాజరై వధూవరులనను ఆశీర్వదించారు.

## బయ్యారం ఎస్సై తిరుపతికి సన్మానం

బయ్యారం, నవంబర్ 24 : బయ్యారం ఎస్సై తిరుపతిని ఎమ్మార్పీఎస్ జాతీయ కమిటీ సభ్యుడు కొండ్రు ఎల్లయ్య ఆధ్వర్యంలో జిల్లా కమిటీ నాయకులు ఆదివారం శాలువాతో సన్మానించారు. గంజాయి నిందితులను పట్టుకొని రవాణాకు అడ్డుకట్ట వేయడంతోపాటు, డీజీపీ నుంచి ప్రశంసాపంత్రం అందుకోవడం అభినందనీయమని తెలిపారు. నాయకపోడు సేవాసంఘం అధ్యక్షుడు పులి శ్రీను, నాయకులు ఉపేందర్, సందీప్, సుధారాణి, రాధా, నిర్మల పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సర్వే డేటా ఎంట్రీ

డోర్నకల్, నవంబర్ 24: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ మూడో రోజు కొనసాగింది. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో మీర్జా మున్వర్‌భేగ్ పరిశీలించారు. డాటా ఎంట్రీలో సందేహాలుంటే అడిగి తెలుసుకొని, నమోదు చేయాలన్నారు.

## రేపు దేశవ్యాప్త నిరసన

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 24: కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న దేశవ్యాప్తంగా చేపట్టనున్న నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్, లింగన్న పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన స మావేశంలో వారు నిరసన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ ఎన్నికల వాగ్దానాలను విస్మరించి రైతులు, కార్మికులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, నిజాముద్దీన్, కృష్ణ, ఏకాంబ్రం పాల్గొన్నారు.

## నేడు 'ప్రజావాణి' రద్దు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 24: కలెక్టరేట్‌లో ఈ నెల 25న నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీలో బిజీగా ఉన్నందున కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు. జిల్లా ప్రజలు గమనించాలని కలెక్టర్ సూచించారు.

## శతాధిక వృద్ధురాలి మృతి

బయ్యారం, నవంబర్ 24: మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు వీర వెళ్లి వెంకటమ్మ(106) ఆదివారం రాత్రి మృతి చెందింది. భర్త నర్సింహారెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడు కాగా, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేఖంగా పోరాడి రజాకారుల చేతుల్లో వీర మరణం పొందాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటమ్మ తుదిశ్వాశ విడిచారు.

## 'ఎంపీడీవోపై చర్య తీసుకోవాలి'

నర్సింహులపేట, నవంబర్ 24: మండల అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంపీడీవోపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేశ్, యాకూబ్ డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. భారీ వర్షాల వల్ల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కనీసం కిందిస్థాయి సిబ్బందికి సలహాలు, సూచనాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. గ్రామంలో శానిటేషన్ కరువైందని, పర్యవేక్షణ అసలే లేదన్నారు. పలుమార్లు గ్రామాల సమస్యలపై వివరించినా పట్టించుకొనే వారు కరువయ్యారని మండిపడ్డారు. మండల అభివృద్ధిపై నిర్లక్ష్యంగా ఉన్న ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఉద్యాన పంటలతో అధిక లాభాలు

**జిల్లా ఉద్యాన అధికారి మరియన్న**

రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి మరియన్న

తొర్రూరు, నవంబర్ 24: మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటలు సాగు చేస్తే రైతులకు అధిక లాభాలు వస్తాయని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. ఆదివారం మండలంలోని మాటేడులో రైతులతో కలిసి పంటలను పరిశీలించి మాట్లాడారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని, నిత్యం రోగనిరోధకశక్తి, ఆరోగ్యంగా ఉండడానికి పోషకాలు లభించే పండ్లతోటల పెంపకంతో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. రైతులు మేలైన యాజమాన్య, సేంద్రియ పద్ధతులు పాటించాలని విజ్ఞప్తి చేశారు. సాగులో ఉన్న మిరప, కూరగాయలు, మామిడి తోటలను సందర్శించి యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగుతో మేలు జరుగుతుందని, సంప్రదాయ విధానంతో కూడిన పంటలు కాకుండా శాస్త్రీయంగా నూతన వంగడాలతో పంట లు పండిస్తే అధిక లాభాలు సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బిందు సేద్య, ఆయిల్‌ఫెడ్ అధికారులు ఎల్లయ్య, వెంకట్, అఖిల్, రైతులు భిక్షపతి, కవిత, ప్రవీణ్‌రాజ్, రాములు పాల్గొన్నారు.

**విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి**

నెల్లికుదురు: హాస్టళ్లలో సకల సౌకర్యాలు, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, అలసత్యం వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న హెచ్చరించారు. ఆదివారం మండలంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్ బాలికల వసతి గృహం, షెడ్యూల్డ్ కులాల బాలురు వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? అని అడిగి తెలుకున్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురవకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ కే రాజు, ఎంపీడీవో బాలరాజు, హాస్టళ్ల ప్రిన్సిపాల్స్ ఉన్నారు.

## 'చలో ఇందిరాపార్క్'ను విజయవంతం చేయాలి

నెల్లికుదురు, నవంబర్ 24: బీఎడ్ అభ్యర్థులకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఈనెల 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నా కార్యక్రమానికి బీఎడ్ అభ్యర్థులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటగిరి కిరణ్‌కుమార్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 5 లక్షల మంది బీఎడ్ అభ్యర్థులు ఉన్నారని, 70శాతం స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎస్జీటీ ఉపాధ్యాయుల ప్రమోషన్‌తో నింపడంతో బీఎడ్ అభ్యర్థులు అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎడ్ చేసిన అభ్యర్థులకు 100శాతం ఎస్జీటీ పోస్టులను ఇస్తున్నప్పుడు, బీఎడ్ అభ్యర్థులతో 100శాతం స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎందుకు భర్తీ చేయరని ప్రశ్నించారు. వచ్చే డీఎస్సీ నోటిఫికేషన్‌లో 100శాతం స్కూల్ అసిస్టెంట్ పోస్టులను బీఎడ్ అభ్యర్థులతోనే భర్తీ చేయాలన్నారు. మహాధర్నాకు మహబూబాబాద్ జిల్లా నుంచి బీఎడ్ అభ్యర్థులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు.

గెలుపొందిన క్రీడాకారులతో డీఎస్పీ తిరుపతిరావు

## ముగిసిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు

కేసముద్రం, నవంబర్ 24: మండల పరిధిలోని కల్వల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో రెండు రోజులపాటు జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో ప్రథమ స్థానం ఖమ్మం, ద్వితీయ స్థానం వరంగల్, బాలికల విభాగంలో ప్రథమ స్థానం ఖమ్మం, ద్వితీయ స్థానం నల్లగొండ జట్లు గెలుపొందాయి. చివరి రోజు ఏర్పాటు చేసిన సమావేశంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని, మళ్లీ విజయం కోసం ప్రయత్నించాలని సూచించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ అలవర్చుకోవాలని, ప్రతి పనిలో పట్టుదల, ఏకాగ్రత ఉండాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు అధికంగా వస్తాని, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. చెడు అలవాట్లకు, సెల్‌ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలని, అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి, హెచ్ఎం బండారు నరేందర్, పీఈటీలు కొమ్ము రాజేందర్, కొప్పుల శంకర్, గ్రామ పెద్దలు సీ వెంకన్న, ఎల్ పిచ్చయ్య, ఎం రవీందర్‌గౌడ్, జీ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## మెసెంజర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా యాకయ్య

యాకయ్య

నెల్లికుదురు, నవంబర్ 24: తెలంగాణ విద్యావనరుల కేంద్రం మెసెంజర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నెల్లికుదురు మండల ఎమ్మార్సీ మెసెంజర్ రత్నపురపు యాకయ్యను ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ భిక్షపతి తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఆదివారం మెసెంజర్ల జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏ రమేశ్, ప్రధాన కార్యదర్శిగా బీ రమేశ్, సహాయ కార్యదర్శిగా పీ దర్గయ్య, కోశాధికారిగా సైదులు, గౌరవ జిల్లా అధ్యక్షురాలుగా పార్వతిబాయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు భిక్షపతి పేర్కొన్నారు.

## విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

చెర్లపాలెం బీసీ హాస్టల్‌లో వంటగదిలో సరుకులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

తొర్రూరు/ పెద్దవంగర, నవంబర్ 24: విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని తొర్రూరు తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం తొర్రూరు మండలం చెర్లపాలెం బీసీ బాలుర హాస్టల్, పెద్దవంగరలోని బీసీ బాలుర హాస్టల్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల హాజరు, స్టోర్ రూం, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. వసతి గృహాల్లోని ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధతోపాటు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. అలాగే పెద్దవంగరలోని హాస్టల్ భవనం శిథిలావస్థలో ఉండడం, ప్రహరీ సైతం లేకపోవడంతో ఇబ్బందికరంగా ఉన్నదని వార్డెన్ భాస్కర్ తహసీల్దార్‌కు విన్నవించారు.

## ఉపాధ్యాయుల సంపాదిత సెలవులు మంజూరు చేయాలి

డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న భద్రినారాయణ

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 24: వేసవి సెలవుల్లో పార్లమెంట్ ఎన్నికల్లో, పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో విధులు నిర్వర్తించిన టీచర్లకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని టీఎస్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా భద్రినారాయణ అన్నారు. ఆదివారం డీఈవో రవీందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కళ్లెం వెంకటరెడ్డి, కనకయ్య, రామోజీనాయక్, సుజాత పాల్గొన్నారు.

## 'మతోన్మాద విధానాలను ఎండగట్టాలి'

మట్టెవాడ, నవంబర్ 25: దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న మతోన్మాద, ప్రజా విచ్ఛిన్నకర విధానాలను తిప్పి కొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం రఘునాథ్‌కాలనీలోని పార్టీ కార్యాలయంలో అరూరి కుమార్, రంగరాజు, విజయ, ఎండీ అలం అధ్యక్షతన నిర్వహించిన పార్టీ ఏరియా 8వ మహాసభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు రత్నమాలతో కలిసి రంగయ్య పాల్గొని మాట్లాడారు.

## నిరుపేద కుటుంబానికి బియ్యం అందజేత

నగదు, బియ్యం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సింహులపేట : మండలంలోని పడమటిగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు ఆదివారం క్వింటా 25 కిలోల బియ్యం అందజేశారు. గ్రామానికి చెదిన బాధ వెంకన్న కిడ్నీల వ్యాధితో బాధపడుతూ వైద్యం కోసం ఇబ్బంది పడుతున్నాడు. అతడి కుటుంబానికి రూ. 5వేలు, క్వింటా 25 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ధారం వేదయ్య, మేకల వెంకన్న, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, లింగయ్య యుగేంధర్, రెహమాన్, రమేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి కుటుంబానికి రెడ్యా పరామర్శ

చిన్నగూడూరు, నవంబర్ 24: మండలంలోని ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన ఆది రవి–మౌనిక కుమార్తె హన్విక(5) హైదరాబాద్‌లోని దవాఖానలో మృతి చెందగా, మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ చిన్నారి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆడుతూ పాడుతూ చెలాకీగా ఉండే చిన్నారి మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కంటతడి పెట్టించాయి. కడసారి చూపు కోసం బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

## ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

గూడూరు, నవంబర్ 24: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం అప్పిరాజుపల్లిలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు గద్దె నరేశ్ (34) తన వ్యవసాయ పొలానికి వెళ్లి తిరిగి సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికారు. చివరకు వ్యవసాయ బావిలో పడి మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. నరేశ్ ప్రమాదవశాత్తు బావిలో పడినట్లు కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

## ప్రమాదకరంగా పైపులైన్ గుంత

స్టేజీ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ గుంత

నర్సింహులపేట, నవంబర్ 24: మండలంలోని పెద్ద నాగారం స్టేజీ గ్రామ పంచాయతీ పరిధిలో పైపులైన్ లీకేజీ కావడంతో మరమ్మతు కోసం విషన్ భగీరథ అధికారులు గుంత తీసి పూడ్చకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా ఉన్నది. కొన్ని రోజులుగా గుంత తీయించిన అధికారులు పూడ్చి వేయకపోవడంతో ప్రమాదం వాటిల్లే అవకాశం ఉన్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రమాదం జరుగకముందే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కారు, ట్రాలీఆటో ఢీ.. ముగ్గురికి గాయాలు

మరిపెడ, నవంబర్ 24: కారు, ట్రాలీఆటో ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని మరిపెడ– మహబూబాబాద్ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మరిపెడ నుంచి మహబూబాబాద్ వెళ్తున్న ట్రాలీఆటో, కాంపెల్లి నుంచి తిరుమలగిరికి వెళ్తున్న కారు పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు అదుపు తప్పి ఆకేరు వాగులో పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న గణేశ్, రాజేశ్, గౌతమీకి గాయాలవగా స్థానికులు 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న భిక్షపతి

## మతోన్మాద రాజకీయాలు చేస్తున్న బీజేపీ

గార్ల, నవంబర్ 24: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలు చేస్తున్నదని ఏఐకేఎంఎస్ ఐఎఫ్‌టీయూ నాయకులు మామిడాల భిక్షపతి, అనురాధ అన్నారు. ఆదివారం మద్దివంచలో అమరవీరుల స్మారకస్తూపాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ లక్ష్యాన్ని సాధించడానికి బీజేపీ పని చేస్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య, ఏఎంకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సత్యనారాయణ, జిల్లా కార